# మాట్లాడే బొమ్మ

ఆటో చివరికి జరిగి ఒదిగి కూర్చుంది రమ. ఆమె కన్నా ముందే ఆటో ఎక్కి అవతల చివర కూర్చున్న ఆమె భర్త శివ, ఆమె వైపు చూడనైనా చూడలేదు. రోడ్డు వైపు చూస్తూ కూర్చున్నాడు. అతడు తనపై కోపంతో మండిపోతున్నాడని రమకు తెలుసు. అతడు పలికే ప్రతిమాటకి "ఊ" అనకపోతే శివకి కోపం వస్తుంది!

ఆటో కదిలింది. "ఫుట్‌పాత్" మీదకి దృష్టి మళ్ళించింది రమ. డాక్టర్‌గారి గది పక్కనే "ఫుట్‌పాత్" మీద జనం గుమిగూడి వున్నారు. "మాట్లాడే బొమ్మ"ని చేతికి తగిలించుకొని, బొమ్మ చేత ఏవేవో మాటలు పలికిస్తున్నాడు ఒకడు. జనమంతా అతని చుట్టూనే! మరొకరి మాటలే పలికే వ్యక్తిత్వంలేని వారిని తయారుచెయ్యడం, వారిని మెచ్చుకోవడం ప్రతి మనిషి ప్రతి నిమిషం చూసేది, చేసేదే కదా!

గట్టిగా నిట్టూర్చింది రమ. శివవైపు తొంగి చూసింది. కందగడ్డలా వుంది అతని ముఖం. అంటే ఇంకా కోపం తగ్గలేదన్నమాట!

డాక్టర్ గారిని కలిసి బయటకు రాగానే కనబడింది. "మాట్లాడే బొమ్మ". ఒక నిమిషం చూస్తూ అలా నిలబడింది.

"రావే, ఎంతసేపు అలా చూస్తూ నిలబడతావు?" డాక్టర్‌ని కలవొద్దని మొండికెత్తి నందుకు అప్పటికే ఆమెపై కోపంగా వున్న శివ గట్టిగా అరిచాడు. "పద... పద..." చెయ్యిపట్టి గుంపులో నుంచి ఆమెను బయటకు లాగి అన్నాడు. "తొందరగా పద. ఆ హాస్పిటల్‌లో పని కూడా అయిపోవాలి".

ఆటో ఎక్కి కూర్చున్నాడు శివ. మెల్లగా ఆటోవైపు అడుగులు వేస్తూ రమ, తనని తానే తిట్టుకుంది. "అవును, తప్పు నాదే. నాకు బుద్ధిలేదు. "మాట్లాడే బొమ్మ"ని చూస్తూ నేను నిలబడటమేంటి? నేనే "మాట్లాడే బొమ్మ"ని కదా...?

బొమ్మలంటే శివకి చాలా ఇష్టం. బొమ్మల చేత మాట్లాడించటం, బొమ్మలని ఆడించటం అతని వారసత్వం. అతని పూర్వీకులు బొమ్మలాటలో ఆరితేరినవారని ఒకేసారి బొమ్మచేత కాదు, బొమ్మల చేత మాట్లాడించినవారని అతనే చెప్తూ వుంటాడు.

"నువ్వు సోమవారందాక ఆఫీసుకు వెళ్ళకు..." హఠాత్తుగా అన్నాడు శివ. "నీ బాస్‌కి ఫోను చేసి చెప్పానులే... రెస్టు కావాలి కదా".

రమ ఏమీ అనలేదు. తన తలరాతని మనస్సులో తిట్టుకుంది. ఆమె ఏ రోజు సెలవు పెట్టాలనేది కూడా అతనే నిర్ణయిస్తాడు! అంతే కాదు, ఆమెకి ఏరోజు ఒంట్లో బాగోలేదనే నిర్ణయం కూడా అతనిదే! అతనికి అన్నీ తెలుసు కదా! ఆమె ఏరోజు ఏ చీర కట్టుకోవాలి ఎవరెవరితో మాట్లాడాలి, ఆఫీసులో ఏ "లోన్" పెట్టాలి ఏ కూర తినాలి– అన్నీ అతని నిర్ణయాలే! ఆ నిర్ణయాల నుంచి, ఆమె అంగుళం కదలినా, పట్టాలు తప్పిన రైలు పెట్టెని "క్రేన్"తో తీసి పట్టాలపై పెట్టినట్టు అతని ఉక్కు పిడికిలితో ఆమె జడని పట్టి పైకి లేపి పట్టాలపై పెట్టేస్తాడు, అంతే..!

"హాస్పిటల్ నుంచి అమ్మ ఇంటికేగా...?" మరోసారి శివ పెదవులు పెగిలాయి. "సోమవారం దాకా ఎలాగూ సెలవు చెప్పానుగా రెస్టు తీసుకోవచ్చు. అమ్మ దగ్గర వుంటే ఒంటికి, మనస్సుకీ బాగుంటుంది"

"నిజమే..." రమ అనుకుంది. కాని అమ్మ...ఏ నిమిషమైనా, వర్షించటానికి సిద్ధంగా వున్న శ్రావణ మేఘాల్లా వుంటాయి అమ్మ కళ్ళు.

అమ్మ నవ్వటం, రమ ఎన్నడూ చూడలేదు. ఏదో బాధ అమ్మ ముఖంలో కదిలేది. అమ్మ బాధ ఏమిటో చిన్నప్పుడు అర్థమయేది కాదు రమకి. అయినా అప్పుడప్పుడు అమ్మని అడిగేది "చెప్పమ్మా ఏంటి నీ బాధ...?"

"ఏం చెప్పను తల్లి...? చెప్పినా ఇప్పుడు నీకు అర్థం కాదులే... నువ్వు పెద్దదానివి అవుతున్నావు కదా... మెలమెల్లగా తెలుసుకుంటావు". ధారగా కారే కన్నీరు ఆపుకోలేకపోయింది అమ్మ. జీరబోయిన గొంతుతో మళ్ళీ అంది. "అయినా ఇప్పుడు నీ దృష్టి చదువు మీద వుంచాలి. చదివి మంచి వుద్యోగం సంపాదించి, ఆర్థికంగా నిలబడాలి తల్లీ! అప్పుడు నీకు, నాకుండే బాధలు వుండవు; నాలాంటి బానిస బతుకూ వుండదు".

ఆ మాటలు అర్థం కాలేదు రమకి. కాని తల్లిని కదిలిస్తే, ఆ మాటలే అనేది.

పోను, పోనూ విషయాలు తెలుసుకుంది రమ. ఆమె నాన్న మహానటుడు. వేదికపైనే కాదు, నిత్య జీవితంలో కూడా నటించేవాడు. అతనికి అవసరమైనప్పుడు అమ్మ మీద ప్రేమ కురిపించేవాడు. నాన్న ఇంటిలో కనబడితే, పండగే ఆ రోజు! జీతం డబ్బులు కూడా అంతా ఇచ్చేవాడు కాదు. ఇల్లు గడపటం కోసం చిన్నా చితకా పనులు

చేసి కొంత సంపాదించేది రమ తల్లి. ఏం కావాలని అడిగినా, డబ్బులేదని చెప్పేవాడు. సంపాదిస్తేనే డబ్బు విలువ తెలుస్తుందని చెప్పేవాడు. మనోవ్యధలకు కదిలే రూపంగా మసిలిన రమ తల్లి అనేది "నీ గురించే... నీ గురించే తల్లీ, ఇక్కడ వున్నాను. సంపాదన లేనిదాన్ని... పెద్దగా సంపాదించలేనిదాన్ని... నిన్ను పెంచి పెద్ద చెయ్యాలిగా..." సంధ్యని ఆక్రమించి వశపరచుకున్న చీకటిని చూస్తూ కూర్చుంది ఆవిడ. కాసేపు గడిచాక మళ్ళీ అంది– "తల్లిదండ్రులకు బరువైనానని నాకు పెళ్ళి చెయ్యలేదు తల్లీ. తల్లిదండ్రులు ఇవ్వలేని... భర్త మాత్రమే ఇవ్వగలిగే ఆప్యాయత, అనురాగం పొందుతానని... కానీ, మీ నాన్న..."

"చెప్పమ్మా..."

"నువ్వు పుట్టినప్పుడు, చూడటానికి, 'హాస్పిటల్'కి కూడా రాలేదమ్మా..."

"అదేంటి..."

"ఏం చెప్పను తల్లి. హాస్పిటల్‌కు వస్తే ఖర్చులు చుట్టుకుంటాయేమోననే భయం..."

రమకి షాకు తగిలినట్లైంది.

"మధ్యతరగతి జీవితాలు అంతేనమ్మా. డబ్బు చుట్టూనే తిరుగుతూ వుంటాయి. అందుకే చెప్తున్నాను తల్లి. పెళ్లైనా, నీ సంపాదన నీకు వుండాలి. వివాహానంతర జీవితమైనా హాయిగా వుండాలంటే, నీ ఉద్యోగం నీ సంపాదన నీకు వుండాలి. దాంపత్య జీవితంలో పురుషాధిక్యం తగ్గాలంటే అదొక్కటే మార్గం".

"మూడు వేలు తీసుకోమన్నానుగా... తీసుకోలేదా...?" ఆ మాటలకి ఉలిక్కిపడి చూసింది రమ. శివ ఆమె బ్యాగులో డబ్బు కోసం వెతుకుతున్నాడు.

"కనీసం రెండువేలైనా అవుతుంది. నీ 'బోనస్' డబ్బు నుంచి మూడువేలు తీసుకోమన్నానుగా..."

"తీసుకున్నానులెండి..." కోపం వచ్చినా మెత్తగానే అంది రమ. నిన్ననే రమకి పదివేలు "బోనస్" వచ్చింది. అందువల్లే ఈ రోజు ఈ కార్యక్రమం పెట్టాడు శివ.

"బోనస్" డబ్బులే కావు, జీతం డబ్బులు కూడా లెక్కగా శివ చేతిలో పెట్టాలిసిందే. ఏ ఖర్చైనా శివ యిష్టమే!

"ఇదేంటీ ఈ చండాలం డ్రెస్సు?" ఒకరోజు కేంటీనులో కలిసినప్పుడు సహోద్యోగిని అడిగింది "ఇదేం టేస్టే..."

రమ ఏమీ అనలేదు. నిజంగా రమకి ఆ డ్రెస్సు నచ్చలేదు. దాని "ఆయన" గారి టేస్టు అయివుంటుందిలే... గొప్ప టేస్టు... ప్రమీల వెటకారంగా అంది.

"డ్రెస్సు కూడా 'అయన గారి' ఇష్టమేనా..."

"అంతేనే మరి... అయినా, అవన్నీ నీకు ఇప్పుడు తెలియవులే..."

"ఎందుకని...?"

"ఇంకా నీకు పెళ్ళికాలేదుగా..."

"అయితే పెళ్ళి చేసుకోకూడదు బాబు..."

"మేమంతా అలా అనుకున్న వాళ్ళమే..." మరో సహోద్యోగిని అంది. "మనం చాలా పురోభివృద్ధి సాధించామని పురుషులతో సమానమవుతున్నామని అనుకుంటున్నాం కదూ...? కాని నిజంగా సాధించినదేమిటి? మగాళ్ళతో సమానంగా పరిగెత్తుతున్నాం. కార్లు, స్కూటర్‌లు డ్రైవ్ చేస్తున్నాం. ఉద్యోగాలు చేస్తున్నాం. మన బాధ్యతలని పెంచుకున్నాం తప్ప ఒక భార్యగా పూర్వకాలపు ఆడదానికన్నా సుఖపడుతున్నామా...? భర్తకి బానిసలం కామని చెప్పగలమా? మెడలో వేసిన పసుపుతాడుతో మగాడు మనని ఆడించటం లేదూ...?" జాలువారే కన్నీటిని ఎడమ చేతితో వొత్తుకుంటూ ఆమె మళ్ళీ అంది. "అలనాటి ఆడది పిల్లలని కనే యంత్రమైతే నేటి ఆడది భర్తకి డబ్బుల్ని కనే యంత్రం".

అందరూ ఆమెనే చూస్తూ కూర్చున్నారు.

భోజనం చేస్తూ నోటికి తగిలిన పచ్చిమిర్చి బయటకు తీసి ఆమె అంది. "మన మనస్తత్వాలు మారకపోతే మనం ఇలాగే వుంటాం. పుట్టుకతో వచ్చిన మానసిక బలహీనతలని ముందు గెలవాలి. లేకపోతే సమానత్వం పేరిట ఒత్తిడిని, శారీరక శ్రమని పెంచుకోవటమే మిగులుతుంది. స్కూటర్‌లేని రోజులలో నాకు హాయిగా వుండేది. బయట పనులు "ఆయనే" చేసేవారు. కాని ఇప్పుడు... ఆఫీసు నుంచి ఇంటికెళ్ళి ఇంటిపనులు మొదలు పెడుతుంటే వస్తుంది ఫోను... కూరగాయలు వగైరాలు వెళ్ళి తెచ్చుకోమని... ఆయన క్లబ్బుకు వెళ్ళి ఆలస్యంగా వస్తారని..."

"మా వారూ అంతేలే... పూర్వం పిల్లలని స్కూల్‌లో వొదిలేవారు. నేను స్కూటర్ కొనుక్కున్నాక ఆ పని కూడా నాదే. టైం లేదన్నా వినిపించుకోరు..."

"మన ఇష్టాయిష్టాలు, ఇబ్బందులు పట్టించుకోని వారితో ఎలా బతుకుతాం బాబు..." సంధ్య అడిగింది. "ఇలాగైతే పెళ్ళి చేసుకొని సుఖం ఏమిటి? పెళ్ళికి అర్థం ఏమిటి? అయినా మీరు..."

హఠాత్తుగా బ్రేకు వేశాడు ఆటోవాడు. రోడ్డు కూడలిలో వుంది ఆటో. ఎదురుగా దీపం వెలుగుతోంది.

కూడలి గందరగోళంగా వుంది. పోలీసులు, రోడ్డు నియమావళి డ్రైవర్లని నియంత్రించలేకపోతున్నాయి. ఎర్రదీపం వెలుగుతున్నా ముందుకు సాగుతున్నాయి వాహనాలు.

ఇంచుమించు ఆటోని గీసుకొని వచ్చి ఆగింది ఒక స్కూటర్. యధాలాపంగా చూసింది రమ. స్కూటర్ ముందుభాగంలో ఇంటి సామానులని వెనుక ఇద్దరు పిల్లలని వేసుకొని బరువు మొయ్యలేక ఇబ్బందిపడుతూ ప్రమాదం నుంచి తప్పించుకోగలిగినందుకు ఊపిరిపీల్చుకుంటుంది ఆమె.

చేతికి ఏదో మెత్తగా తగిలినట్లై కంగారుగా తిరిగి చూసింది. శివకి ఆమెకి మధ్య ఆటో సీటు మీద కూర్చుని వుంది ఒక కోతి. దాని చేతుల్లో ఒక గిన్నె. గిన్నెలో చిల్లర డబ్బులు. మెడలో ఒక తాడు. ఆ తాడుతో దూరంగా కూర్చుని కోతిని ఆడించి డబ్బులు సంపాదిస్తున్నాడు దాని యజమాని. రమని చూసి వెకిలిగా నవ్వింది కోతి. దాని యజమాని తాడు కదిపాడు కాబోలు గెంతులు వేసింది. "కీచ్ కీచ్" అనే అరుపులతో రమతో మాట్లాడింది.

ఆ చేష్టలు చూసిన రమకి పిచ్చెక్కినట్లైంది. అసహనంగా అటూ ఇటూ చూసింది. మెల్లగా ఆటో దిగి పరిగెత్తింది. కూడలివద్దే రమ అమ్మ ఇల్లు.

రోడ్డు చూస్తూ కూర్చున్న శివ రమని గమనించలేదు.

"ఏమిటే... ఏమిటీ పరుగు?" పరుగున వచ్చిన రమని చూసి అడిగింది, తల్లి.

"నాతో ఎందుకు అబద్ధమాడావమ్మా...?" అడిగింది రమ. "ఆడదానికి సంపాదన వుంటే పురుషాధిక్యం తగ్గుతుందని, దాంపత్య జీవితం సుఖంగా వుంటుందని చెప్పావు కదమ్మా..."

"అవును, చెప్పాను. ఇప్పుడు ఏమైంది?"

"నీ మాట విని చదువుకున్నాను, సంపాదిస్తున్నాను; ఆయన కన్నా ఎక్కువే సంపాదిస్తున్నాను. అయినా నేనింకా మగాడికి  బానిసనేనమ్మా..." రమ గొంతు జీరబోయింది.

"పిల్లలని కనాలని నాకు వుండదా అమ్మా... ఆడపిల్ల అంటే నాకు ఇష్టం. ఆయనకి ఇష్టం లేదని 'అబార్షన్' చేయించుకోవాలా?"

ఏమనాలో తోచలేదు, రమ తల్లికి. "అబార్షన్" గురించే బయలుదేరాం అమ్మా. నువ్వు అబద్ధమాడావమ్మా..."

"లేదు, తల్లీ లేదు. అప్పటి పరిస్థితులనిబట్టి అలా అన్నాను..."

"మరి ఇప్పుడు..."

జవాబు పలకలేదు రమ తల్లి. లోపలకు వెళ్ళి మంచం మీద చతికిలబడింది రమ.

రమ మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు - ఆలోచనల యుద్ధం- పుట్టుకతో

చిగురించి తనతో పాటు ఎదిగిన స్త్రీ సహజ భావాలు, జీవితానుభవాలతో పోరాడుతున్నాయి. నిమిషాలు బరువుగా అడుగులు వేసి వెళ్ళాయి. గ్లాసులో చల్లటి నీళ్ళతో వచ్చింది రమ తల్లి. "కొంచెం నీళ్ళు తాగు" అంది. "చల్లటి నీరుతో చల్లారేది కాదమ్మా, నా గుండెలోని బాధ" జాలువారే కన్నీరు వొత్తుకుంటూ రమ అంది. "చదివి, ఉద్యోగం చేసి పురుషునితో బాధ్యతలు పంచుకుంటే జీవితం సుఖంగా వుంటుందని అనుకున్నాను. కాని నేను మోసపోయానమ్మా... నేనింకా బానిసనేనమ్మా... మాట్లాడే బొమ్మనేనమ్మా..." వెక్కి వెక్కి ఏడ్చింది రమ.

రమ తల్లికి నోటమాటరాలేదు.

"పెళ్ళి అనేది ఒక పవిత్రమైన ఒప్పందం అమ్మా" ఒక నిమిషం పోయాక రమ మళ్ళీ అంది. "ఆడ, మగ సహజీవనం కోసం ఏర్పరచుకున్న ఒక ఒప్పందం. ఒకరి భావాలని ఇష్టాలని వేరొకరు గౌరవించటం, కించపరచకపోవటం ఆ ఒప్పందం కొనసాగటానికి చాలా అవసరం. కాని మగవాడు తరచూ మా భావాలని అణిచివేస్తూ వుంటే..." రమ మాటలు పూర్తి చెయ్యలేదు. శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది. ఆమె కళ్ళలో ఒక మెరుపు మెరిసింది.

కూతురుని అక్కున చేర్చుకొని ఓదార్చాలని రెండడుగులు ముందుకు వేసింది రమ తల్లి. కాని... మెడలోని మంగళ సూత్రం తీసి మంచంమీద పడేసిన రమని చూసి శిలలా నిలబడిపోయింది.

***